సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

వైద్య శిబిరంలో 90 మందికి పరీక్షలు



మహిళలకు బీఎండీ పరీక్ష చేస్తున్న డాక్టర్ నాయుడు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం దుర్గానగర్‌లో నాయుడు పోలీక్లినిక్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆరిలోవ కాలనీ, దుర్గాబజార్, దుర్గానగర్, టి.ఐ.సి.పాయింట్ ప్రాంతాల నుంచి సుమారు 90 మంది మహిళలు, వృద్ధులకు వైద్య సేవలు అందించారు. వీరికి శరీరంలో కాల్షియం శాతం తెలుసుకొనే బీఎండీ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ నాయుడు మాట్లాడుతూ శరీరంలో కాల్షియం తగ్గకుండా చూసుకోవాలని, దానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎండీ టెక్నీషియన్ పాల్గొన్నారు.

అబ్బురపరిచిన ఎక్స్‌పో



లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్‌లో వివిధ నమూనాలతో పిల్లలు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి ఆదర్శ నగర్‌లో లిటిల్ కిడ్డీస్ ప్లే స్కూల్‌లో ఆదివారం కిడ్డీస్ ఎక్స్‌పో నిర్వహించారు. ఇక్కడ ఎల్.కేజీ, యూకేజీ చదువుతున్న పిల్లలతో ఉపాధ్యాయులు పలు అంశాలతో కూడిన నమూనాలు తయారు చేయించి ప్రదర్శించారు. ఈ ప్రదర్శనలు విద్యార్థుల తల్లిదండ్రులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్నారుల్లో సృజనాత్మక శక్తి పెంపొందడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఉపాధ్యాయులు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమను కాపాడుకోవాలి



1109వ రోజు ఉక్కు దీక్షలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మికుల పోరాటాల ఫలితంగా ఏర్పడిన స్టీల్‌ప్లాంట్ ప్రైవేట్‌పరం కాకుండా దేశ ప్రజలందరూ ఏకమై కాపాడుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు సూచించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్షల్లో 1109వ రోజు, ఆదివారం సంస్థకు చెందిన వివిధ విభాగాల కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదా లు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అమరవీరుల ప్రాణత్యాగంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు పరిశ్రమను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరించడం దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కు విషయంలో ప్రజలందరూ కేంద్రప్రభుత్వాన్ని నిలదీయాలన్నా రు. సంస్థ కోసం కార్మికులు నిరాహార దీక్ష చేస్తున్నా కేంద్రంలో చలనం లేకపోవడం దారుణమన్నారు.

రేపు పాదయాత్ర

ఎన్నో పోరాటాలు, ఉద్యమాల ఫలితంగా ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడంలో కార్మిక వర్గంతో పాటు దేశప్రజలంతా మమేకమై పాల్గొనాలని కోరారు. ఈ నెల 27న కూర్మన్నపాలెం దీక్ష శిబిరం నుంచి జీవీఎంసీ దీక్ష శిబిరం వరకు జరిగే పాదయాత్రలో కార్మికులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ పాలన

వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



హనుమంతవాక వద్ద మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



జీవీఎంసీ 9వ వార్డులో మహిళతో మాట్లాడుతున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

ఆరిలోవ: రాష్ట్రంలో అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన కొనసాగుతోందని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. జీవీఎంసీ 9వ వార్డులో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు కార్పొరేటర్ స్వాతి, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులుతో కలిసి ఆయన పాదయాత్ర చేశారు. వార్డులో హనుమంతవాక, సంజయ్‌గాధీ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిశారు. వారితో మాట్లాడి స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఎలాంటి లబ్ధి పొందుతున్నారో అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించి, మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అర్హులందరికీ సీఎం జగన్ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నారని కొనియాడారు. అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా ఆయనే కావాలని ప్రజలంతా కోరుతున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



తోటగరువు హైస్కూల్‌లో 2003 - 04 పదో తరగతి విద్యార్థులు, అప్పటి ఉపాధ్యాయులు

ఆరిలోవ: ఆరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003 – 04 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకొన్న విద్యార్థులు ముడసర్లోవ పార్కులో ఆదివారం కలుసుకున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల్లో ఎక్కడెక్కడో స్థిర పడిపోయిన వారంతా ఒక్కచోటకు చేరడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. 20 ఏళ్ల కిందటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఆటపాటలతో రోజంతా సరదాగా గడిపారు. తరగతి గదిలో అప్పటి సరదాలు, సంగతులు, అల్లరి గుర్తు చేసుకొన్నారు. ఈ సందర్భంగా అప్పటి తోటగరువు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వరహాలురాజు, పలువురు ఉపాధ్యాయులను ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. మధ్యాహ్నం ఉపాధ్యాయులతో కలిసి అందరూ భోజనాలు చేశారు.

ప్రశాంతంగా గ్రూప్ - 2 పరీక్షలు



అభ్యర్థిని తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో గ్రూప్ – 2 పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. ప్రతీ విద్యార్థిని పోలీసులు తనిఖీ చేసి కేంద్రాల్లోకి అనుమతించారు. చివరి నిమిషం వరకూ విద్యార్థులు పరీక్ష కేంద్రాల్లోకి వస్తూ కనిపించారు. ప్రతీ అభ్యర్థి గుర్తింపు కార్డు, హాల్ టికెట్ సరిచూసిన తర్వాతే అనుమతించారు. సెల్‌ఫోన్లు, బ్యాగులు కేంద్రం వెలుపలే వదిలేయాలని సూచించారు.

అవగాహనతోనే క్యాన్సర్‌కు అడ్డుకట్ట

బీచ్‌రోడ్డు: అవగాహనతోనే క్యాన్సర్‌ను పూర్తిగా అరికట్టవచ్చని డాక్టర్ వంశీధర్ స్పష్టం చేశారు. జూనియర్ ఛాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులో క్యాన్సర్‌పై అవగాహన కోసం కాళీ మాత ఆలయం నుంచి వైఎంసీఏ వరకు ఆదివారం నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఆహార అలవాట్లు, జీవన శైలి కారణంగా ప్రతీ 50 మందిలో ఒకరికి క్యాన్సర్ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. మహిళల్లో స్వీయ పరీక్ష ద్వారా క్యాన్సర్ ప్రాథమిక దశలో గుర్తించి తగిన చికిత్స ద్వారా నివారించవచ్చని తెలిపారు.



మాట్లాడుతున్న డాక్టర్ వంశీధర్

కార్యక్రమంలో జేసీఐ వైజాగ్ పారమౌంట్ అధ్యక్షుడు బి.చైతన్య రాజీవ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం ప్రత్యేక ఆహ్వానితునిగా శ్రీధర్

ఎంవీపీ కాలనీ: బీజేపీ యువ మోర్చా విశాఖ స్టేట్ ఎగ్జిక్యూటివ్ ప్రత్యేక ఆహ్వానితునిగా పట్టా శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ ఆదివారం ప్రకటన విడుదల చేశారు. విశాఖతోపాటు బాపట్ల, నెల్లూరు, కాకినాడ, శ్రీ సత్యసాయి జిల్లా, ఈస్ట్ గోదావరి, తిరుపతికి బీజేవైఎం ప్రత్యేక ఆహ్వానితులను నియమించారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు, బీజేవైఎం ప్రతినిధులు పట్టా శ్రీధర్‌కు అభినందనలు తెలిపారు.

నయనానందకరంగా ఛత్రపతి శివాజీ నాటకం



ఛత్రపతి శివాజీ నాటకంలో ఓ సన్నివేశం



శివాజీ విగ్రహానికి పుష్పాలను అర్పిస్తున్న సంస్కార భారతి సభ్యులు

ఏయూ క్యాంపస్: యువతలో దేశభక్తిని పెంపొందించే విధంగా ఛత్రపతి శివాజీ నాటకం ప్రదర్శించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం కె.వి.గోపాల స్వామి ఆరుబయలు రంగస్థలం వేదికగా ప్రదర్శించిన నాటకం నగరవాసులను ఆకట్టుకుంది. సంస్కార భారతి ఆధ్వర్యంలో శివాజీ మహారాజ్ జీవిత చరిత్రను నేటి తరానికి తెలియజేసే విధంగా నాటకాన్ని ప్రదర్శించారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ పట్టాభిషేకం జరిగి 350 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ మహావీరుని జీవిత చరిత్రను నాటక రూపంలో ప్రదర్శించినట్లు సంస్కార భారతి విశాఖ జిల్లా అధ్యక్షురాలు డి.శర్వాణి తెలిపారు. సాయంత్రం ఆరు గంటల నుంచి సుమారు రెండు గంటలకు పైగా సాగిన నాటకంలో శివాజీ జీవితంలోని ప్రేరణదాయకమైన ఘట్టాలను, విజయాలను, అనేక కోటల నిర్మాణలను, పరిపాలనా చాతుర్యతను ప్రదర్శించారు. 60 మంది నటీనటులతో, ఆధునిక సాంకేతికతతో నయనానందకరంగా నాటకం సాగింది. దశాబ్దాల తర్వాత పునరుద్ధరించిన ఓపెన్ ఎయిర్ థియేటర్లో ఈ నాటకాన్ని పెద్ద ఎత్తున ప్రేక్షకులు విచ్చేసి తిలకించారు. సంస్కార భారతి రాష్ట్ర అధ్యక్షుడు, నంది పురస్కార గ్రహీత డాక్టర్ పి.వి.ఎన్.కృష్ణ రచన, దర్శకత్వంలో నాటక ప్రదర్శన ప్రేక్షకులకు కనువిందు చేసింది.

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



శింగనబందలో ప్రచారం చేస్తున్న ప్రతినిధులు

తగరపువలస : త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రబోధ సేవా సమితి విజయరాంపురం ప్రతినిధులు ఆదివారం భీమిలి మండలం శింగనబంద పంచాయతీలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో భాగంగా శివరాత్రి ప్రాశస్త్యాన్ని వివరించారు. శివ జాగరణ వల్ల కలిగే ఫలితాలు వివరించారు. శివరాత్రి పూజల్లో పాల్గొనడం ద్వారా కలిగే మోక్షజ్ఞానం గురించి వివరించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు కె.త్రినాథరావు, సభ్యులు వి.సురేష్, ఎస్.శ్రీనివాసరావు, సత్యవతి, డి.అంకమ్మ, కె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన నారసింహ మహాయజ్ఞానికి భూమిపూజ

వచ్చే నెల 26 నుంచి యజ్ఞం ప్రారంభం



నేచురల్ స్టోన్స్ తీసుకొస్తున్న పూసపాటి అశోక్‌గజపతి రాజు, ఈవో శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు



భూమి పూజలో భాగంగా యజ్ఞశాల ప్రదేశంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: లోక కల్యాణార్థం సింహగిరిపై మార్చి 26 నుంచి ఏప్రిల్ 1వతేదీ వరకు నిర్వహించనున్న చదుర్వేద హవనపూర్వక, పాంచాహ్నిక పంచకుండాత్మక శ్రీ సుదర్శన నారసింహ మహా యజ్ఞానికి ఆదివారం భూమిపూజను శాస్త్రోక్తంగా నిర్వహించారు. సింహగిరిపై ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న ప్రదేశంలో కార్యక్రమం వైభవంగా చేశారు. విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవచనం, వాస్తు ఆవాహనం, వాస్తు పురుష ఆవాహనం, వాస్తు కలశ ఆవాహనం నిర్వహించారు. అనంతరం నాగలి, ఎద్దులకు పూజలు చేశారు. ఏడు సార్లు కర్షణం(భూమిని దున్నే కార్యక్రమం) నిర్వహించారు. యాగభూమిని శుద్ధి చేశారు. దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు , దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు సంపంగి శ్రీనివాసరావు, గంట్ల శ్రీనుబాబు, వారణాసి దినేష్ రాజ్, వంకాయల సాయినిర్మల సువ్వాడ శ్రీదేవి, పెనుమత్స శ్రీదేవి వర్మ, దశమంతుల రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు తదితరులు ఈ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ మాట్లాడుతూ లోకం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో సింహగిరిపై పెద్ద ఎత్తున సుదర్శన నారసింహ మహా యజ్ఞం నిర్వహించ తలపెట్టినట్టు చెప్పారు. 50 మంది రుత్విక్కులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. మార్చి 26న ఉదయం రుత్విక్ వరణం, సాయంత్రం అంకురార్పణతో యజ్ఞం ప్రారంభమవుతుందన్నారు. 27 ఉదయం అగ్నిప్రతిష్ఠ ఉంటుందన్నారు. ఏప్రిల్ 1 ఉదయం పూర్ణాహుతి, శాంతి కల్యాణంతో యజ్ఞం ముగుస్తుందన్నారు. భక్తులంతా ఈ కార్యక్రమంలో పాల్గొని తరించాలని కోరారు. యజ్ఞంలో పాల్గొనే భక్తుల విధి విధానాలను త్వరలో ప్రకటించనున్నట్టు తెలిపారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ దాదాపు పదేళ్ల తర్వాత సింహగిరిపై పెద్ద ఎత్తున సుదర్శన నారసింహ మహాయజ్ఞం నిర్వహిస్తున్నామని తెలిపారు.

దాతల సహకారంతో ఆధునికీకరణ

సింహగిరిపై ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న కల్యాణ మండపం ప్రాంగణాన్ని దాతల సహకారంతో ఆధునికీకరిస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అటు వైదికపరంగా, ఇటు భక్తులకు వినియోగపడేలా షెడ్ నిర్మాణం, నేచురల్ స్టోన్స్‌తో ఫ్లోరింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. నగరానికి చెందిన అంగర రాజేష్ అనే దాత 25వేల ఎస్ఎఫ్‌టీ మేర నేచురల్ టైల్స్‌తో ఫ్లోరింగ్ ఏర్పాటుకు ముందుకు వచ్చారని తెలిపారు. ఈ మేరకు సంబంధిత నేచురల్ స్టోన్స్‌ను దేవస్థానం అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు ప్రదర్శించారు.షెడ్ నిర్మాణం కూడా దాతల సహకారంతో చేస్తామని తెలిపారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ సబ్ స్టేషన్ 33/11 కేవీ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున పైనాపిల్‌కాలనీ, సీబీడీ కార్యాలయం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, కామాక్షినగర్, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, గోల్ఫ్ క్లబ్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్ – 3 ఈఈ పి.శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

- హనుమంతవాక నుంచి విశాలాక్షినగర్ వెళ్లే మార్గంలో ఫుట్‌పాత్‌ల నిర్మాణం కారణంగా రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు మార్చుతున్నారు. దీంతో ఈ ప్రాంతానికి సంబంధించిన విమ్స్ సబ్ స్టేషన్ 33/11 కేవీ పరిధి 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ పనులు విద్యుత్ విభాగం అధికారులు చేపడుతున్నారు. దీంతో సోమవారం విశాలాక్షినగర్ ప్రాంతం కైలాసగిరి, పోలీస్ మైదానం, హనుమంతవాక, రామాలయం వీధి, శ్రీరాంనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయా ప్రాంతాల ప్రజల సహకరించాలని ఆయన కోరారు.

యాదవులకు రాజకీయ ప్రాధాన్యమివ్వాలి



మాట్లాడుతున్న వెంగళరావు

బీచ్‌రోడ్డు: యాదవ కులస్తులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఉత్తరాంధ్ర యాదవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శివాజీపాలెంలోని సంఘం భవనంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఉత్తరాంధ్ర యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాక వెంగళరావు మాట్లాడుతూ విశాఖపట్నం జిల్లాలో రెండు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు యాదవ కులస్తులకు కేటాయించాలని డిమాండ్ చేశారు. అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కొక్క ఎమ్మెల్యే సీటు కేటాయించాలని కోరారు. యాదవ కులస్తులను బీసీ డీ జాబితా నుంచి బీసీ బీ జాబితాలోకి మార్చు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు ఒమ్మి సన్యాసి రావు, జనరల్ సెక్రటరీ గొంప అప్పారావు, ఉపాధ్యక్షుడు ప్రగడ చెన్నారావు, జనరల్ సెక్రెటరీ ముల్లి అప్పారావు, ఎడ్ల సుమన్ పాల్గొన్నారు.

బెదిరింపు కాల్స్ వచ్చాయని ఫిర్యాదు

ఎంవీపీ కాలనీ: తనకు బెదిరింపు ఫోన్ కాల్స్ వచ్చాయంటూ విశాఖ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫిర్యాదు కాపీని ఎంవీపీ సీఐ సంజీవరావుకు ఆదివారం ఉదయం అందజేశారు. ఈ నెల 24న రాత్రి 8.30 గంటల నుంచి 11 గంటల మధ్య గుర్తు తెలియని మూడు ఫోన్ నంబర్స్ నుంచి బెదిరింపు కాల్స్ వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌లో అసభ్య పదజాలంతో దుర్భాషలాడడంతోపాటు చంపేస్తామని బెదిరించినట్లు వెలగపూడి ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఓ నంబర్ నుంచి వచ్చిన ఫోన్ కాల్‌లో అవతలి వ్యక్తి తన పేరు రంజన్‌గా పేర్కొనట్లు తెలిపారు. బెదిరింపులకు పాల్పడిన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని సీఐని కోరారు. ఈ ఫిర్యాదును కోర్టు ముందుంచనున్నట్లు సీఐ సంజీవరావు వెల్లడించారు. కోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా విచారణ చేపడతామని తెలిపారు.

విద్యార్థులకు నైపుణ్యాలు అవసరం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

బీచ్‌రోడ్డు: విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని డాక్టర్ జి.శ్రీనివాసరావు సూచించారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాతీయ సేవా పథకం ప్రత్యేక శిబిరంలో ఆయన మాట్లాడుతూ జీవితంలో ఉపయోగపడే ఏదైనా నైపుణ్యాన్ని మెరుగుపరచుకోవాలన్నారు. లైఫ్ స్కిల్స్ అనే పదాన్ని జీవితంలోని సవాళ్లను చక్కగా, సమర్థంగా ఎదుర్కొనేందుకు ఉపయోగిస్తారన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పోల ఉమామహేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టానుసార పార్కింగ్‌పై కొరడా

విశాఖ సిటీ: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై చర్యలకు పోలీస్ శాఖ సమాయాత్తమవుతోంది. రోడ్లపై, నో పార్కింగ్ ప్రదేశాల్లో వాహనాలు నిలపడం ద్వారా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారికి చలానాలు వేయాలని నిర్ణయించింది. అలాగే మద్యం తాగి వాహనాలు నడిపినా, ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. ఇప్పటికే నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు నగర పరిధిలోని షాపింగ్ మాల్స్, ప్రధాన షాపుల యాజమాన్యంతో పోలీసులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వాహనాలు రోడ్ల మీద కాకుండా సెల్లార్ పార్కింగ్ చేసుకునేలా చూడాలని సూచించారు. నగరంలో వాహనదారులు ఇష్టానుసారంగా రోడ్లపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే వారిపై మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం రూ.1000 జరిమానా విధించనున్నారు. వాహనాలను టోయింగ్ రికవరీ వ్యాన్‌తో తీసుకువెళ్లి, వీల్ లాక్స్ చేయడం జరుగుతుందని ఏడీసీపీ(ట్రాఫిక్) శ్రీనివాస్ స్పష్టం చేశారు. అలాగే పార్కింగ్ సౌకర్యం ఉండి పార్కింగ్‌నకు వినియోగించని షాపుల యాజమాన్యంపై కూడా చట్ట ప్రకారం చర్య తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు, వాహన యజమానులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే సెక్షన్ 190ఏ మోటార్ వాహనాల చట్టం ప్రకారం వారికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.25 వేలు జరిమానా విధిస్తారని చెప్పారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై, మోటార్ వాహన నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు ఉన్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ద్విచక్ర వాహనాన్ని నడిపే సమయంలో హెల్మెట్ విధిగా ధరించేలా వారిని అప్రమత్తం చేయాలని సూచించారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణపుష్పార్చన వైభవంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేదికపై వేంజేపచేశారు. 108 స్వర్ణసంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, అర్చకుడు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కల్యాణమండపంలో వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేణపూజ, పుణ్యాహవాచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదంని అర్చకులు అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం గరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజని నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

27న బహిరంగ వేలం

నబ్బువరం: మండలంలోని లింగాలతిరుగుడులోని సోమలింగేశ్వర స్వామి దేవస్థానానికి చెందిన జీడిమామిడి తోట ఫలసాయం అనుభవించడానికి బహిరంగ వేలం పాట ఈ నెల 27న నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వాహక అధికారి కె. ఆదినారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్వే నెంబర్ 79లో 3.50 ఎకరాల జీడిమామిడి తోట ఏడాది ఫలసాయానికి, సర్వే నెంబర్ 70/7,70/11 లలోని 3.60 ఎకరాల భూమి మూడేళ్ల కౌలు సాగుకు ఈ వేలం పాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్వామి వారి దేవస్థానం వద్ద టెండర్ కమ్ బహిరంగ వేలం పాట ద్వారా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జీడి మామిడి తోట ఫలసాయానికి రూ.5 వేలు, కౌలు హక్కుల కోసం రూ.10 వేలు ధరావత్తుగా చెల్లించి పాటలో పాల్గొనవచ్చునని తెలిపారు.

WANTED TEACHERS
Telugu language teacher for 5th, 6th and 7th classes immediately
Salary as per qualifications & experience
WONWORLD SCHOOL
4-47-7, Lawsonsbay Colony, Pedawaltair, VSP-17. CELL: 9807823456 / 9392001001

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751
Office mail : sakshiadvtvsp@gmail.com